క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్ల కొమ్మల తొలగింపు, పలు మరమ్మతు పనుల కారణంగా ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలోని కింద తెలిపిన ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని డీఈ హన్మంత్ రెడ్డి తెలిపారు.

- **ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు**
  విజయ్‌నగర్, శంకర్‌నగర్, పద్మానగర్, మలక్‌పేట మటన్ మార్కెట్, హైలక్, బాడీగార్డ్‌లేన్, అజంతాకాలనీ, అంబేద్కర్ నగర్, పీటీసీ ఆఫీస్, అన్నపూర్ణ అపార్ట్స్, బాదంగల్లీ, విద్యానగర్, శంకర్‌నగర్ ఓల్డ్, కిసాన్ దొడ్డి, సరోజీనగర్ పరిసర ప్రాంతాలు.
- **మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు...**
  పోచమ్మ టెంపుల్, ఈదార్మియా, హెచ్‌బీ కాలనీ, ఎంసీ కాలనీ వాటర్‌వర్క్స్ పరిసర ప్రాంతాల్లో కరెంట్ ఉండదని ఆయన తెలిపారు. రేపు కేంద్రమంత్రితో కార్యకర్తల సమావేశం

రేపు కేంద్రమంత్రితో కార్యకర్తల సమావేశం

సైదాబాద్: బీజేపీ భాగ్యనగర్ జిల్లాకు చెందిన ముఖ్య కార్యకర్తలతో కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి సమావేశం కానున్నారని పార్టీ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 3న ఉప్పుగూడ అండర్‌పాస్ వద్ద ఉన్న ధన్‌రాజ్ ఫంక్షన్‌హాల్‌లో సమావేశం ఏర్పాటు చేసామని తెలిపారు. సమావేశంలో జిల్లా పరిధిలోని శక్తి కేంద్రాల ఇన్‌చార్జ్‌లు, పార్టీ డివిజన్ కమిటిల సభ్యులు, అన్ని డివిజన్‌లలోని అన్ని మోర్చాల అధ్యక్ష, కార్యదర్శులు, భాగ్యనగర్ పరిధిలోని జిల్లా, రాష్ట్ర పార్టీ ప్రతినిధులు హాజరవుతారని ఆయన తెలిపారు.

గవర్నర్ సత్కారం ఉత్తేజాన్ని కలిగిస్తుంది



చాదర్‌ఘాట్: రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా సత్కారం అందుకోవటం మరింత ఉత్తేజాన్ని కలిగిస్తున్నదని కళాకారిణి డాక్టర్ పద్మప్రియ ఆనందం వ్యక్తం చేసారు. నూతన సంవత్సరం రోజున నిర్వహించిన కార్యక్రమంలో కళారంగంలో మూడుసార్లు రాష్ట్రపతి అవార్డ్ పొందిన ఆమెను గవర్నర్ తమిళిసై సన్మానించారు. ఈ సందర్భంగా మలక్‌పేటలో ఆమె మాట్లాడుతూ, దివ్యాంగులు అన్ని రంగాల్లో ముందుండాలని గవర్నర్ సూచించారని తెలిపారు.

నాగోలు వెంకటరమణ కాలనీ నూతన కమిటీ ఎన్నిక

నాగోలు: డివిజన్ పరిధిలోని వెంకటరమణ కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా వీఎస్ఎస్ మురళికృష్ణ, ఉపాధ్యక్షులు దశరథరావు, కార్యదర్శిగా ఎన్. కోటయ్య, సహాయ కార్యదర్శులుగా జయప్రకాష్ పెండ్యాల, కోశాధికారి చంద్రశేఖరబాబు, కార్యవర్గ సభ్యులుగా ఎ.వీ వెంకటరమణలను ఎన్నుకున్నారు. అనంతరం సభ్యులు నాగోలు కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్‌యాదవ్‌ను కలిశారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం

హస్తినాపురం: క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వంగా విద్యార్థులు ఉంటారని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతనాయక్ అన్నారు. సాగర్ రోడ్డులోని కేశవపురి కాలనీ నార్త్ చౌరస్తాలోని శ్రీచైతన్య పాఠశాలలో జరిగిన స్పోర్ట్స్ మీట్ కార్యక్రమాన్ని ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సుజాత నాయక్ మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడల్లోను విద్యార్థులు రాణించాలని సూచించారు. క్రీడల ద్వారా దేహదారుఢ్యంతో పాటు ఏకాగ్రత, పట్టుదల కూడా పెరుగుతాయని అన్నారు. శ్రీచైతన్య విద్యాసంస్థల ఏజీఎం సతీష్, ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మీ, కోఆర్డినేటర్ రఘువంశీ, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

నూతన సంవత్సర వేడుకల్లో యువకుల ఘర్షణ

సైదాబాద్: నూతన సంవత్సర వేడుకల్లో మద్యం మత్తులో యువకులు ఘర్షణకు దిగారు. స్థానికులు తెలిపిన మేరకు.. సైదాబాద్‌లోని ఒక ఫంక్షన్‌హాల్‌లో శనివారం రాత్రి నూతన సంవత్సర వేడుకలు ఏర్పాటు చేసారు. అయితే మద్యం సేవించిన తరువాత రెండు గ్రూపులకు చెందిన యువకులు ఘర్షణకు దిగారు. ఒకరినొకరు తోసుకుంటూ కొట్లాడుకున్నారు. యువకుల ఘర్షణతో ఈవెంట్‌లోని కుర్చీలు, బ్యారికేడ్‌లు విరిగిపోయాయి. మద్యం మత్తులో యువకులు చేసిన వీరంగం దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అయితే యువకుల ఘర్షణ విషయమై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని సైదాబాద్ పోలీసులు తెలిపారు.

అంబరాన్నంటిన నూతన సంవత్సర సంబరాలు



బాలాజీనగర్‌లోని సాయి ఆలయంలో పూజలో పాల్గొన్న బీఎన్‌రెడ్డి కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి



నాగోలు జైపురి కాలనీలోని భాగ్య ఎన్‌క్లేవ్ అపార్టుమెంటులో చిన్నారుల నృత్యాలు

దిల్‌సుఖ్‌నగర్: నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. కుటుంబ సభ్యులు , బంధువులు, కాలనీవాసులతో కలసి ఆనందోత్సాహాల మధ్య నూతన సంవత్సర సంబరాలు అంబరాన్నంటాయి. ఆదివారం మహేశ్వరం, మలక్‌పేట్ నియోజకవర్గాల పరిధిలోని అన్ని ప్రాంతాలలో న్యూఇయర్ వేడుకలను నిర్వహించారు. ఈసందర్భంగా కాలనీలలో కేక్‌లు కట్‌చేశారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ఆలయాలను, చర్చీలను విద్యుత్ దీపాలతో, పూలవూలలతో అలంకరించి స్వామివార్లకు, అమ్మవార్లకు విశేష అలంకరణగావించారు. అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు

సందడిగా మారిన ప్రధాన పార్కులు...

సరూర్‌నగర్, ఆర్‌కేపురం, మూసారంబాగ్, ఐఎస్‌సదన్‌లోని పార్కులు నూతన సంవత్సరం,ఆదివారం సెలవురోజు కావడంతో కుటుంబ సభ్యులతో కలిసిఈ పార్కులలో సందడి చేశారు. పార్కుల్లోను నూతన సంవత్సర వేడుకలను స్నేహితులు, కుటుంబ సభ్యులు కలసి నిర్వహించుకున్నారు. ఈసందర్భంగా పార్కుల్లో అంతట ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. పరిధిలోనిలోని పలు ఆలయాల్లో నూతన సంవత్సరం సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ప్రధాన ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు నూతన సంవత్సరంలో ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని ఆలయ పూజారులు భక్తులను దీవించారు. భక్తుల ఎలాంటి అసౌకర్యం కలగకుండ ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. కాలనీలలో నూతన సంవత్సరం వేడుకలను నిర్వహించారు. ఈసందర్భంగా వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు కేక్ కట్ చేశారు. నూతన సంవత్సర క్యాలెండర్‌లను విడుదల చేశారు.

న్యూ ఇయర్ వేడుకలు...

చైతన్యపురి: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో న్యూ ఇయర్ వేడుకలు సందడిగా జరిగాయి. అర్ధరాత్రి సమయంలో బాణా సంచా కాల్చి కేక్‌కట్ చేసి నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. నృత్యాలు, కేరింతలతో ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అపార్టుమెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు, మహిళా సంఘాల ఆధ్వర్యంలో నూతన సంవత్సరం సందర్భంగా జరిగిన ఉత్సవాల్లో చిన్నారులు, యువతీ యువకులు, మహిళలు పాటలు పాడుతూ నృత్యాలు చేస్తూ సందడి చేశారు. నూతన సంవత్సరం రోజు దేవాలయాల్లో పూజలు చేయటం ఆనవాయితి. ఆదివారం ఉదయం తెల్లవారు జాము నుంచే ఆయా ప్రాంతాల్లోని దేవాలయాలు దర్శనాల కోసం భక్తులు బారులు తీరారు.



మూన్‌వాకర్ డ్యాన్స్ స్టూడియోలో కేక్ కట్ చేస్తున్న నృత్య దర్శకుడు చక్రీజాక్సన్



కొత్తపేటలని ఆర్టిస్టి క్లిక్ ది ప్రీ స్కూల్‌లో స్కూల్ ఫౌండర్ నీలిమ, కోఫౌండర్ చక్రీ తదితరులు

చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు

మలక్‌పేట: న్యూ ఇయర్ పురస్కరించుకుని దిల్‌సుఖ్‌నగర్ బాప్టిస్టు చర్చి, కేటీనగర్ బేతనీయ చర్చి, మూసారంబాగ్ క్రిస్టియన్ లైఫ్ సెంటర్ చర్చి, మలక్‌పేట ది పెంతకోస్తు చర్చి, రాక్‌చర్చి తదితర చర్చిలలో శనివారం రాత్రి, ఆదివారం ఉదయం ప్రత్యేక ప్రార్థనలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్తుతీ గీతాలతో యేసు ప్రభువును ఆరాధించారు. కొత్త సంవత్సరం తీర్మానాలు చేయించి, యేసుక్రీస్తు శరీరము, రక్తమునకు సాదృశ్యంగా ఉన్నటువంటి ప్రభువుబల్ల (రొట్టే, ద్రాక్షారసం) క్రైస్తవులకు అందజేశారు.

వనస్థలిపురం: వనస్థలిపురంలోని లిటిల్ ల్యాంబ్ చర్చీలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం రాత్రి వాచ్ నైట్ సర్వీసు కార్యక్రమంను నిర్వహించారు. ఆదివారం పాస్టర్ రెవ డా.కే.సుదర్శన్‌రావు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, కేకును కోసి ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో చర్చి కమిటీ అధ్యక్షులు బాబూరావు, ఉపాధ్యక్షులు జార్జిముల్లర్, కార్యదర్శి భానుకిరణ్, సంయుక్త కార్యదర్శి ఎన్.జాన్, కోశాధికారి సురేష్‌కుమార్, జాకబ్ ప్రసాద్, రఘురాం, కాంత రమేష్, విజయలక్ష్మి లాజరస్ పాల్గొన్నారు.



కేటీనగర్ బేతనియ చర్చిలో.. పాస్టర్ రెవరెండ్ సామ్యూల్ బైరపోగు



దిల్‌సుఖ్‌నగర్ బాప్టిస్టు చర్చిలో.. పాస్టర్ సాల్మన్ బోద



వనస్థలిపురం లిటిల్ ల్యాంబ్ చర్చీలో ప్రార్థనలో పాల్గొన్న క్రైస్తవులు

ఫెయిత్ బాప్టిస్ట్ చర్చిలో సంబరంగా వేడుకలు

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్ సింగరేణికాలనీలోని ఫెయిత్ బాప్టిస్ట్ చర్చిలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం చర్చిలో పాల్గొన్న వారితో పాస్టర్ ఆర్.భీముడు నాయక్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కేక్‌కట్ చేసి అందరూ పరస్పరం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో యాకత్‌పురా బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ సామ సుందర్‌రెడ్డి, తెలంగాణ క్రిస్టియన్ వెల్ఫేర్ అసోషియేషన్ అధ్యక్షుడు నల్లిమెల్లి మోజెస్ పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న సామ సుందర్‌రెడ్డి, పాస్టర్ భీముడు నాయక్

బ్రహ్మ శ్రీనివాస బంగారయ్య శర్మను కలసిన దేపభాస్కర్‌రెడ్డి



శ్రీనివాస్ బంగారయ్య శర్మకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న దేప భాస్కర్‌రెడ్డి తదితరులు

దిల్‌సుఖ్‌నగర్: ఆంగ్ల నూతన సంవత్సరం సదర్భంగా ఆధ్యాత్మిక వేత్త బ్రహ్మ శ్రీనివాస బంగారయ్య శర్మ (శృంగేరి పీఠం ఉభయ తెలుగు రాష్ట్రాల సంచాలకులు) ఆదివారం మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి , కాంగ్రెస్ నాయకులు సి. ఉపేందర్ రెడ్డి కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పెద్దవూర సైదులు, శ్రీనివాస్ గుప్తా, సంతోష్, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి పట్టుబడ్డారు

నాగోలు: రాచకొండ పరిధిలోని ఎల్‌బీనగర్ జోన్ పరిధిలో నూతన సంవత్సరం సందర్భంగా శనివారం రాత్రి నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 180 మంది మద్యం సేవించి వాహనలు నడుపుతూ పోలీస్‌లకు పట్టుబడారు. ట్రాఫిక్ పోలీస్‌లు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ చౌరస్తాల వద్ద నిర్వహించిన వాహనాల తనిఖీల్లో 85 మంది పట్టుబడ్డారు. వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన వాహనాల తనిఖీల్లో 95 మంది మద్యం సేవించి పట్టుబడ్డారు. ఈ మేరుకు ట్రాఫిక్ పోలీస్‌లు వారి వద్ద నుంచి వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి వారి కుటుంబ సభ్యుల సమక్షంలో ఎల్‌బీనగర్‌లోని ట్రాఫిక్ టీటీఐలో కౌన్సెలింగ్ ఉంటుందని పోలీస్‌లు తెలిపారు. ఈ సందర్భంగా ఎల్‌బీనగర్ పరిధిలోని వివిధ ఫ్లైఓవర్‌లపై ప్రమాదాలు జరగకుండా శనివారం రాత్రి ఫ్లైఓవర్‌లను ఎల్‌బీనగర్ ట్రాఫిక్ పోలీస్‌లు మూసీ వేశారు.

వైకుంఠ ఏకాదశికి సర్వం సిద్ధం

- ముక్కోటికి ముస్తాబైన ఆలయాలు
- నేడు ఆలయాలల్లో ఉత్తర ద్వార దర్శనం
- భక్తుల దర్శనానికి భారీ ఏర్పాట్లు పూర్తి



ముక్కోటి ఏకాదశికి ముస్తాబైన జిల్లెలగూడ శ్రీబాలాజీ వెంకటేశ్వరస్వామి ఆలయం



వాసవికాలనీలో శ్రీఅష్టలక్ష్మీ ఆలయంలో నారాయణస్వామి, అమ్మవారు

దిల్‌సుఖ్‌నగర్: పరమ పవిత్రమైన వైకుంఠ (ముక్కోటి ఏకాదశి) ఏకాదశికి సర్వం సిద్ధమైంది. వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని మలక్‌పేట్, మహేశ్వరం,యాఖుత్‌పుర నియోజకవర్గాల పరిధిలోని వైష్ణవ ఆలయాలు ఆలయాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. సోమవారం ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పరమ పవిత్రంగా జరుపుకునేందుకు ఆలయ కమిటీలు సర్వం సిద్ధం చేశారు.

ఉత్తర దర్శనానికి ఆలయాలు సిద్ధం..

జోన్ పరిధిలోని ఆర్‌కేపురం డివిజన్ వాసవీకాలనీలోని శ్రీఅష్టలక్ష్మీ దేవాలయం, మలక్‌పేట్ ఆంజనేయ స్వామి ఆలయం, జిల్లెలగూడలోని శ్రీబాలాజీ వెంకటేశ్వరస్వామి ఆలయం, కర్మన్‌ఘాట్‌లోని ధ్యానాంజనేయస్వామిఆలయం, గ్రీన్‌పార్కు కాలనీ గోదాసమేత శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం, సైదాబాద్‌లోని రామాలయం, దిల్‌సుఖ్‌నగర్‌లోని శ్రీవీరవెంకట సత్యానారాయణస్వామి ఆలయంతోపాటు వివిధ ప్రాంతాల్లో ఉన్న శ్రీవెంకటేశ్వర, మహావిష్ణు, వేణుగోపాలస్వాముల ఆలయాలతోపాటు, బడంగ్‌పేట్, జల్‌పల్లి, కందుకూర్, మహేశ్వరంలలోని ఆలయాలలో ఉత్తరా ద్వార దర్శనానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. తెల్లవారజాము నుంచే ఉత్తర ముఖ ద్వారం ద్వారా స్వామివారి దర్శనాన్ని చేసుకోవచ్చని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

చైతన్యపురి: వైకుంఠ ఏకాదశి సందర్భంగా మంగళవారం దిల్‌సుఖ్‌నగర్ లలితానగర్‌కాలనీలోని గడ్డిఅన్నవర క్షేత్రం శ్రీవీరవెంకట సత్యనారాయణ స్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం కోసం ఏర్పాట్లు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకునేందుకు వస్తుండటంతో ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటి సభ్యులు తెలిపారు. తెల్లవారు జామున 4.30 గంటల నుంచే భక్తులు దర్శనం చేసుకోవచ్చొన్నారు.

నేడు ఉత్తర ద్వార దర్శనం..

వనస్థలిపురం: చింతలకుంట జనప్రియ హోమ్స్‌లోని శ్రీ గోదా పద్మావతీ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ధనుర్మాస వ్రత మహోత్సవములు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ పీ.వీ.నర్సింహారావు తెలిపారు. సోమవారం వైకుంఠ (ముక్కోటి) సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం, 13వ తేదీన గోదా కళ్యాణం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి



వనస్థలిపురం సీఐకి వినతి పత్రం అందజేస్తున్న నందారెడ్డి

హస్తినాపురం: ఇసుకలారీల యజమానులపై గుండాలతో దాడికి పాల్పడిన అయితగోని లక్ష్మయ్యగౌడ్ పైకఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ లారీ ఓనర్స్ వెల్‌ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నందారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం వనస్థలిపురం సీఐ సత్యనారాయణకు అసోసియేషన్ ప్రతినిధులు వినతి పత్రం అందజేశారు. వనస్థలిపురంలోని ఆటోనగర్ బాల్‌రెడ్డి ఇసుకలారీల అడ్డాదగ్గర లారీ అసోసియేషన్ నాయకులందరూ డిసెంబర్15 న ఓవర్‌లోడ్‌లు వద్దని కేవలం పాసింగ్ లోడులు మాత్రమే తీసుకురావాలని నిర్ణయం తీసుకున్నామని దీనిని అతిక్రమించిన అయితగోని లక్ష్మయ్యగౌడ్ అసోసియేషన్ నిర్ణయాలను అతిక్రమించినందుకు అసోసియేషన్ ప్రతినిధులు మందలించడంతో గుండాలతో దాడిచేయించారని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంచిరెడ్డి రాజేందర్‌రెడ్డి, సలావుద్దీన్, సుర్వీరాజుగౌడ్, మాధవరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా బేతనియ బాప్టిస్టు చర్చి వార్షికోత్సవం



ప్రసంగిస్తున్న డాక్టర్ శారా రోజ్ సామ్యేల్ గొల్లపల్లి

మలక్‌పేట: మూసారంబాగ్ బేతనియ బాప్టిస్టు చర్చి 17వ, వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య ప్రసంగికులుగా డాక్టర్ శారా రోజ్ సామ్యేల్ గొల్లపల్లి హజరై కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యేసుక్రీస్తు బోధనలు అనుసరించి నడుచుకోవాలన్నారు. యేసు క్రీస్తు జీవితం సర్వమానవాళికి మార్గదర్శమని, ఆయన ఇతరుల పట్ల చూపించిన ప్రేమ, క్షమా గుణం అందరూ కలిగి ఉండాలన్నారు. చర్చి పాస్టర్ రెవరెండ్ సామ్యేల్‌బాబు బైరపోగు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

కేలండర్ ఆవిష్కరణ

మన్సూరాబాద్: గిన్నిస్ వరల్డ్ రికార్డ్ హోల్డర్ (4టైమ్స్), రచయిత, సామాజిక కార్యకర్త డాక్టర్ పెండెం కృష్ణకుమార్ రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ ఆదివారం రాజ్‌భవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కృష్ణకుమార్ ఎల్‌బీనగర్‌లో మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్ సంచుల వాడకాన్ని తగ్గించి, క్లాత్ సంచులను వాడాలని కోరారు. వివిధ కళాత్మక ఫోటోలతో రూపొందించిన కేలండర్‌ను ఆమె ఆవిష్కరించినట్లు తెలిపారు.



క్లాత్ బ్యాగులను వాడాలని సూచిస్తున్న గవర్నర్ తమిళసై సుందరరాజన్

వనస్థలిపురంలో..

వనస్థలిపురం: హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని భూలక్ష్మీనగర్ కాలనీ సంక్షేమ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను కార్పొరేటర్ క్లోం నవజీవన్ రెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు కాలనీవాసులు ఐకమత్యంగా ఉంటూ ప్రతి ఏడాది క్యాలెండర్‌ను రూపొందించుకోవడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు కాశీపతి, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీరాములు, మాధవరెడ్డి, దేవేంద్ర, నాగేశ్వర్‌రావు, అశోక్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



తవ్వి వదిలేసిన రోడ్లు.. దారులన్నీ అస్తవ్యస్తం



గడ్డిఅన్నారం బస్తీలో తవ్వి సరిగా పూడ్చని రోడ్డు



రాళ్ల కుప్పలతో పూడ్చిన రోడ్డు

మలక్‌పేట: అంతర్గత రోడ్లు తవ్వి సరిగా పూడ్చకుండా వదిలేయడంతో అధ్వానంగా మారాయి. పైపులైన్ల కోసం తవ్విన సీసీ, బీటీ రోడ్లు గుంతలమయమయ్యాయి. రోడ్లపై మట్టికుప్పలు, రాళ్ల కుప్పలు, గుంతలు నరకం చూపిస్తున్నాయి. సరైన మరమ్మతులకు నోచుకోక రాకపోకలు కొనసాగించడానికి అవస్థలు పడుతున్నారు. వాహనాల రాకపోకల ధాటికి మరింత అధ్వానంగా మారాయి. మూసారంబాగ్ డివిజన్ పరిధిలోని దిల్‌సుఖ్‌నగర్, గడ్డిఅన్నారం, ఇందిరనగర్, బ్యాండ్‌బస్తీ తదితర ప్రాంతాలలో నెలకొన్న రోడ్ల దుస్థితి. అసలే ఇరుకైన దారులతో ఇబ్బందులు.. పైగా తవ్వి వదిలేయడం వలన అడుగుతీసి అడుగు వేయలేని పరిస్థితి. ఈ ప్రాంతాలలో విద్యా, వ్యాపార, వాణిజ్య సంస్థలతో రద్దీ ఎక్కువగా ఉంటుంది. పాడైపోయిన రోడ్ల మూలంగా వాహనదారులు, పాదచారులు తిప్పలు పడుతున్నారు. ప్రమాదాలు చోటు చేసుకున్న పట్టించుకునే వారు కరువయ్యారు. జీహెచ్ఎంసీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి రోడ్లు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్లు పాడైన ప్రాంతాలు:

- ▲ దిల్‌సుఖ్‌నగర్ అనిబిసెంట్ కాలేజ్ ఎదురుగా ఉన్నలైన్‌లో
- ▲ గడ్డిఅన్నారం బస్తీలో ..
- ▲ దిల్‌సుఖ్‌నగర్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సమీపంలో..
- ▲ ఈస్ట్‌ప్రశాంత్‌నగర్‌లోని వృద్ధుల ఆశ్రమం ఎదురుగా..
- ▲ మూసారంబాగ్ ఇందిరనగర్‌లో కమ్యూనిటీ హాల్ లైన్‌లో..
- ▲ బ్యాండ్‌బస్తీ రేణుక ఎల్లమ్మ ఆలయం నుంచి..

ధర్మరక్షణకు త్యాగం చేసినవారు ఆదర్శప్రాయులు

సైదాబాద్: ధర్మరక్షణ కోసం ఎందరో మహాసుభావులు తమ జీవితాలను త్యాగం చేసారని వీహెచ్‌పీ ప్రాంత సహ కార్యదర్శి రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. ఐఎస్‌సదన్ డివిజన్ కృష్ణానగర్‌లోని కారుణ్య సింధు బాలల ఆశ్రమంలో కరుణశ్రీ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్మరక్షా దివస్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, ధర్మరక్షణ కోసం త్యాగం చేసిన వారు మనందరికీ ఆదర్శప్రాయులన్నారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు ఆచార్య సత్యమూర్తి, కార్యదర్శి పుప్పాల వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి రాజేందర్‌రెడ్డి, సత్యనారాయణ, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న వీహెచ్‌పీ ప్రాంత సహ కార్యదర్శి రాజేశ్వర్‌రెడ్డి

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



హస్తినాపురం: నల్లగొండ జిల్లా మర్రిగూడ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న 1985 బ్యాచ్‌కు చెందిన పదవతరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం హస్తినాపురం లోని ఎస్ఆర్ గ్రాండ్ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగింది. 37 సంవత్సరాల తర్వాత కలుసుకున్న సహచరులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. రమావత్ శ్రీనివాస్‌నాయక్, రమావత్ పద్మా నాయక్, పద్మ, రాధ, విజయమ్మ, నసిరిన్, లక్ష్మీ, వనిత, అంజమ్మ, సునిత, కె.శ్రీనివాస్, కృష్ణ, వసంత్, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.